'ఒరే నాయనా, తండ్రీ, పితాజీ, అప్పా! చాలించు నీ గోల...' మనసు ఘోషని బయటికి చెప్పలేకపోయాను.

"నాకేమో సిగ్గుగా ఉంటుందండీ. అమ్మా నాన్నా ఏమనుకుంటారు చెప్పండి."

సి.ఎమ్. గురించి ట్రాఫిక్ ఆపేశారు. అయినా వాడు నన్ను వదల్లేదు.

"మీరే చెప్పండి ఇంట్లో మొగుడూ పెళ్లాలు ఇద్దరే ఉంటే పర్లేదు. కానండీ... అందరూ ఉన్నప్పుడు, ఓసారి చుట్టాలొచ్చినప్పుడు"

'బాబోయ్ దేవుడా! నన్ను నువ్వే రక్షించాలి!' నా గుండె వేగం నాకే స్పష్టంగా తెలుస్తోంది. "మీకేదైనా పని ఉంటే చూసుకోండి. నేను నడిచి వెళ్లిపోతాను" కష్టం మీద అనగలిగాను.

"మరేం పర్లేదు, మిమ్మల్ని దింపిగానీ వెళ్లను" అన్నాడు వాడు.

సి.ఎమ్. కారు వెనకే ఓ పాతికో ముప్ఫయ్యో కార్లూ జీపులూ వేగంగా దూసుకుపోయాయి.

సరిగ్గా అప్పుడే సైకిల్లో గాలి పోయింది. ఇదే మంచి సమయం అని అతని నుంచి తప్పించుకోవాలని చూశాను. కానీ వాడు పట్టిన పట్టు వదల్లేదు. నాతో పాటు నడిచి వచ్చి ఇంటివరకూ దిగబెడతానని ఒట్టు పెట్టుకున్నాడు. పొద్దున్న లేచి ఎవరి ముఖం చూశానో, నా ఖర్మ కాలింది.

గాంధీగారి దగ్గరినుంచీ బఠాణీల వరకూ ఏదీ వదలకుండా మాట్లాడుతూనే ఉన్నాడు.

వాడి సోదంతా నా చావుకొచ్చింది. తప్పించుకునే మార్గం ఏదైనా దొరుకుతుందేమోనని ఆశగా చూస్తున్నాను. కానీ దారి కనిపించడం లేదు.

అంతా అయిపోయాక టాపిక్ ఇంకేమీ దొరకక మళ్లీ మొదటికొచ్చాడు వాడు. "కానీ మీరు మాత్రం చాలా గొప్పవారండీ. నాతో మీ బఠాణీలు పంచుకున్నారు. నాతో ఎప్పుడూ ఎవరూ ఇంతసేపు మాట్లాడలేదండీ. ఎందుకో నాకే తెలీదు!"

ఆ మాటకి నాకు ఒళ్లు మండిపోయింది.

"మా ఆవిడ చాలా మంచిదండీ. ఇది కావాలీ, అది కావాలీ అని ఎప్పుడూ అడగదు. గొడవంతా బెడ్‌రూం లోనే"

"మీ పర్సనల్ విషయాలు నాకెందుకండీ" నేను మళ్లీ అడ్డెళ్లబోయాను.

"సార్!" గట్టిగా అరిచాడు. నేను షాక్ అయ్యాను. అతని మొహం ఎర్రగా అయిపోయింది. చాలా కోపంగా చూస్తూ నావైపు తిరిగాడు. కొడతాడేమోనను కున్నాను. నా భయం చూసి శాంతించాడు. నాకేం అర్థం కాలేదు. అతను పిచ్చివాడా? మంచివాడా? ఎటూ తేల్చుకోలేకపోయాను.

"మీరు అలా పరాయి మనిషిలా మాటాడకండి సార్. ప్లీజ్! నేను తట్టుకోలేను. నాకు మీరు తప్ప ఎవరున్నారు చెప్పండి?"

కాసేపటి పరిచయంలోనే అతను అంతంతేసి మాటలు తూటాల్లా పేలుస్తూ ఉంటే ఇంక నేనేం మాటాడను, బిక్కచచ్చిపోయి చూస్తూ ఉండటం తప్ప!

అసలు ఇవాళే ఎందుకు వాన పడాలి? పడింది పో, బస్సెందుకు లేటయ్యిందీ? అయింది పో, ఆటో కోసం ఎందుకు ట్రై చెయ్యాలీ? చేస్తి పో, బేరం కుదరక ఎందుకు నడవాలీ? నడిస్తి పో, వీడెందుకు తగలాలీ?

ఇంక నావల్ల కాదు. వెధవ, చంపేస్తున్నాడు. ఎప్పుడూ ఎక్కువగా మాటాడని నేను, వీడి మాటల వల్ల ఇంత ఎక్కువగా ఆలోచిస్తున్నాను!

"ఆ షాపులో పని ఉంది" అన్నాను భయం భయంగా.

"మీరెళ్లి రండి, నేనిక్కడే ఉంటాను" అన్నాడు. అది చూస్తే శారీస్ షోరూమ్. చాలా రష్‌గా ఉంది. ఆడవాళ్ల మధ్యనుంచి వెళ్లి తప్పించుకోడానికి నాకు సిగ్గేసింది.

పక్కనే ఉన్న హార్డ్‌వేర్ షాపు చూపించి, లోపలికెళ్లాను. అవసరం లేకపోయినా ఓ సుత్తి, రంపం, డజను మేకులు, ఫెవీకాల్ కొని బయటపడ్డాను.

అలాగే సైకిలు పట్టుకుని ఓ సైనికుడిలా నిల్చున్నాడు. ఇప్పుడెలా తప్పించుకోవడం? ఈ 'నస'గాడికి నా ఇల్లు చూపిస్తే, ఇక చచ్చానన్నమాటే! డౌటు లేదు, రోజూ వస్తాడు. అప్పుడు నేనూ వాడిలా 'నస'గాడిలా మారిపోతానేమో! అమ్మో...దేవుడా!

నేనింకేమీ ఆలోచించదలుచుకోలేదు. వాడి దృష్టి నామీద పడకముందే, ముక్కుకు సూటిగా చూస్తూ పరుగు లంకించుకున్నాను. అక్కడున్న సందులూ గొందులూ నాకు సహకరించాయి.

ఓ నెల తర్వాత, ఓరోజు అనుకోకుండా రోడ్డుమీద ఎదురయ్యాడా నసగాడు ప్రఫుల్లకుమార్. నా వెన్నులోంచి భయం ఒళ్లంతా పాకింది.

సరిగ్గా అప్పుడే వాడు నన్ను చూసి సంతోషం పట్టలేక బిగ్గరగా పిలిచాడు. కాదు, అరిచాడు.

నేను వెనక్కి తిరిగి, మళ్లీ తిరిగి చూడకుండా మెరుపులా పరుగు లంకించుకున్నాను.

-వరుణ (హైదరాబాద్)

OOO

# లిఫ్ట్

ఆ వీధిలో నా పని పూర్తిచేసుకుని బస్టాప్‌కి వచ్చాను. ఆటో ఎక్కితే పదిహేను ఇరవై రూపాయలు ఖర్చు. మనసు అంగీకరించలేదు. రిటైర్ అయిన తర్వాత పొదుపు మనస్తత్వం వచ్చేసింది. నా ఇంటి దగ్గరనుండి జంక్షన్ వరకే స్కూటర్ ఉపయోగిస్తాను. హైవే మీదికి వచ్చి బస్సో, షేర్ ఆటోనో పట్టుకుని నా పనులు ముగించుకుంటాను.

అలాగే ఈవేళ బస్సులో వచ్చి పని పూర్తిచేసుకున్నాను. బస్టాప్ వరకూ నాకు లిఫ్ట్ దొరికితే చాలు. స్కూటర్లు, మోటార్ బైక్‌లూ వెళుతున్నాయి. కానీ ఎవరూ ఆపడం లేదు. 'జ్ఞానాపురం బస్టాపు వరకు లిఫ్ట్ సార్' అని ఓ ఎనిమిది మంది వాహనదారుల్ని అడిగాను. పాపం ఎవరి బిజీ వారిది. విసుగేస్తోంది. కాలికి పని చెప్పాలేమో!

నాకు కాళ్ల మడంలో నొప్పి ఎక్కువగా వస్తూ వుంటుంది. అందుకే మెత్తని చెప్పుల్ని వాడుతుంటాను. ఎక్కువ దూరం నడవలేను.

తొమ్మిదో వాహనం కూడ ఆగలేదు. పదో వాహనం వచ్చి నా ముందు ఆగింది. స్కూటర్ మీదున్న వ్యక్తి నావైపు చురచుర చూసి, ఏదో తిట్టుకుంటూ ముందుకు సాగిపోయాడు. ఎక్కించుకోకపోతే పోయాడు... అతని చూపులకు, తిట్లకు నాకు బాధనిపించింది.

ఈ వేళకి ఇక లాభం లేదు. ఉస్సూరంటూ నడక ప్రారంభించాను.

ఓ అయిదు నిముషాలు నడిచి కంచరపాలెం బ్రిడ్జి చివరి భాగానికి చేరుకోబోతున్నాను. అక్కడైతే నాకు షేర్ ఆటోలు దొరుకుతాయి.

అక్కడ జనం గుంపుగా మూగి వున్నారు. బస్సులు, ఆటోలు కూడ ఆగిపోయాయి. యాక్సిడెంట్‌లా వుంది. మనసులో ఆత్రం పెరిగి చూశాను.

అతగాడే! సందేహం లేదు. లిఫ్ట్ అడిగితే ఇవ్వకపోగా చదామడా నాలుగు తిట్టేసి వెళ్లినవాడు. నాకు జాలేసింది.

అందరూ చోద్యం చూస్తున్నారు. ఎవరో మంచినీళ్లు ముఖం మీద కొడుతున్నారు.

ఒకరిద్దర్ని వాకబు చేసి, 108 నెంబరుకి ఫోన్ చేశాను. పది నిముషాల్లో అంబులెన్స్ వచ్చింది. కె.జి.హెచ్‌కి తరలించడానికి అందరూ సిద్ధపడ్డారు. నేను కాస్తా జోక్యం చేసుకుని నావంతు సహకారం అందించాను.

వాహనం కదులుతున్నప్పుడు అతడు నా ముఖంలోకి చూశాడు. "ఏం ఫర్వాలేదు. దెబ్బలు ఎక్కువగా ఏమీ తగల్లేదు. అధైర్యపడకండి" అన్నాను.

అతడ్ని ఒ.పి.లో చేర్చాను. డాక్టర్స్ వచ్చి చూశారు. ఓ గంట వరకు అతనితోనే వున్నాను. కాస్త రిలీఫ్‌గా కనిపించాడు. నా ముఖంలోకి సూటిగా చూడలేకపోతున్నాడు. ఏదో తప్పు చేశానన్న ఫీలింగ్ అతనిలో కనబడుతోంది.

అతను కొంచెం తేరుకున్నాక "నేను వస్తాను" అని చెప్పి కదలబోయాను. "మరో గంటలో మిమ్మల్ని డిశ్చార్జి చేస్తారట" అని కూడ చెప్పాను.

"నా సెల్ నెంబరు ఇస్తాను. ఏదైనా అవసరం వుంటే ఫోన్ చెయ్యండి. నా స్కూటర్ మీద రాలేదు. సెర్వికల్ ప్రాబ్లమ్ వుంది. మెడ అటూ ఇటూ తిప్పలేను. బస్సులో గానీ, షేర్ ఆటోలోగానీ వస్తాను. ఎవరైనా లిఫ్ట్ ఇస్తే తీసుకొని వస్తాను" అంటూ నేను కదిలి వెళ్లిపోతుండగా అతను 'థాంక్స్' అనడం మాత్రం నాకు వినిపించింది.

- కూర్మాన వెంకటసుబ్బారావు (విశాఖపట్నం)